ఆహారం విషతుల్యం!

- అన్ని పదార్థాలను కల్తీ చేస్తున్న వైనం
- కల్తీతో రోగాలు ఖాయం
- త్వరగా మాగేందుకు పండ్లపై రసాయనాలు
- హోటల్, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లలోనూ ప్రమాదకర రసాయనాలు
- నేడు వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే


కుళ్లిన పండ్లను చెత్త బండిలో వేయిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్):
● కర్నూలు నగరంలోని పెద్దమార్కెట్ వద్ద ఉన్న ఓ హోల్‌సేల్ పండ్ల దుకాణంలో ఇటీవల అధికారులు దాడులు నిర్వహించారు. అందులో పాడై పోయిన, రసాయనాలతో మాగబెట్టిన పండ్లను గుర్తించి మున్సిపల్ చెత్త వాహనంలో పారవేయించారు.
● ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలోని మధులోక్ బార్ అండ్ రెస్టారెంట్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించి చికెన్ దమ్ బిర్యానీ శ్యాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించారు. బిర్యానీలో ప్రమాదకరమైన సింథటిక్ కలర్ (అజంతా) కలిపినట్లు నిర్ధారణ కావడంతో వారికి నోటీసులు పంపించారు. వీరిపై గతంలోనూ కేసులున్నాయి.
● జిల్లాలో పలు బెల్లం దుకాణాలపై ఇటీవల అధికారులు దాడులు నిర్వహించి బెల్లం శ్యాంపిల్స్ తీసి ల్యాబోరేటరీకి పంపించారు. ఇందులో కర్నూలులో రెండు, ఆదోని, గూడూరులోని దుకాణాల్లో బెల్లంలో సింథటిక్ కలర్ కలిపినట్లు ల్యాబ్ నివేదిక వచ్చింది. కేవలం కలర్స్ కలపని నల్ల బెల్లం మాత్రమే వాడాలని అధికారులు సూచిస్తున్నారు.
● కర్నూలు నగరంలోని ఓ మిల్క్ డైరీలోని పాల ప్యాకెట్‌పై 'పాలలో ఎలాంటి హార్మోన్లు కలవలేదని, ఎలాంటి ప్రిజర్వేటివ్స్ లేవని, కల్తీ జరగలేదని, యాంటిబయాటిక్స్ వాడలేదని' ముద్రించారు. ల్యాబ్‌కు పంపితే ఆ పాలు కల్తీగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.
● అలాగే నగరంలోని పలు డ్రైఫ్రూట్స్ దుకాణాలపై ఇటీవల అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో మదీనాలో రెండు, డ్రైఫ్రూట్ హౌస్‌పై ఒక కేసు నమోదు చేశారు. వీరు కివీ, పైనాపిల్‌లో సింథటిక్ కలర్స్ కలిపి విక్రయించినట్లు ల్యాబ్‌లో నివేదిక వచ్చింది.

ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి మనిషి వాడే ఆహార పదార్థం కల్తీలేదని చెప్పలేని పరిస్థితి. ఏ వస్తువు తీసుకున్నా అంతో ఇంతో అందులో కల్తీ జరిగి ఉంటోంది. ఇటీవల అధికారులు నిర్వహిస్తున్న వరుస దాడుల్లో ఈ విషయం వెలుగులోకి వస్తోంది. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో వ్యాపారులు ఆహార పదార్థాల్లో కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. ఇందుకోసం ప్రమాదకర రసాయనాలను, పదార్థాలను వాడుతున్నారు. ఈ నెల 7వ తేదీన వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపుగా చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చాట్, నూడుల్ షాపులు 7 వేలకు పైగా ఉంటాయి. కర్నూలు నగరంలోనే 1600 దాకా హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. ఆయా వ్యాపార సంస్థల ద్వారా ఏటా వందల కోట్ల వ్యాపారం జరుగుతోంది. రోడ్డుపైడు దుకాణాలతో పాటు కార్పొరేట్ కంపెనీలు విక్రయించే ఆహార పదార్థాలు సైతం కల్తీ జరిగినట్లుగా ల్యాబోరేటరీ నివేదికలు చెబుతున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాకు కర్నూలులోని ఆహార భద్రత ప్రమాణాల శాఖ ఉంది. ఇందులో ఒక ఏఎస్‌ఓ, నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక సూపరింటెండెంట్ ఉన్నారు. ఒక్కో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నెలకు 12 శ్యాంపిల్స్ సేకరించాలి. రెండు జిల్లాల జనాభాకు అనుగుణంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో పూర్తిస్థాయిలో వ్యాపారులపై దాడులు నిర్వహించలేకపోతున్నారు. ఉన్న అధికారులు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తారు.

నిత్యావసరాలన్నీ కల్తీ


ఉప్పు, పప్పు, బియ్యం, గోదుమలు ఇలా నిత్యావసరాలన్నింటినీ వ్యాపారులు కల్తీ చేసి విక్రయిస్తున్నారు. కొందరు తూకం ఎక్కువగా రావడానికి మట్టి, రాళ్లను వేస్తుండగా, మరికొందరు ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులు కలిపి విక్రయిస్తున్నారు. కర్నూలులో అధికారులు ఇటీవల నిర్వహించిన దాడుల్లో ఇలాంటి మోసాలు అనేకం బయటపడుతున్నాయి. ముఖ్యంగా ఆహార పదార్థాల తయారీ సంస్థల నుంచే ఇవి కల్తీ జరిగి వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా సంస్థలకు నోటీసులు అందజేశారు.

అనుమతి లేకుండా వ్యాపారాలు

ఏదైనా వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. ఈ శాఖలో నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండటం లేదు. చాలా మంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వ్యాపార దుకాణాలు తెరిచేస్తున్నారు. వాటిలో కనీస శుభ్రత, కల్తీ నివారణ చర్యలు తీసుకోవడం లేదు. అన్ని దుకాణాల్లో ఆహార భద్రత అధికారులతో పాటు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయడం లేదు.

బిర్యానీలు, జంక్‌ఫుడ్‌లలో విచ్చలవిడిగా కల్తీ

రోడ్డుపైడు విక్రయించే బజ్జీల పిండితో పాటు గోబీ మంచూరియా, చికెన్ మంచూరియా, ఫాస్ట్‌ఫుడ్‌తో పాటు జంక్‌ఫుడ్‌లలోనూ కల్తీ జరుగుతోంది. జంక్‌ఫుడ్‌లలో ప్రమాదకరమైన సింథటిక్ కలర్స్‌తో పాటు టేస్టీ సాల్ట్‌ను వేయడంతో అవి రుచిని పెంచుతున్నాయి. ఈ రుచికి అలవాటు పడిన వారు తిరిగి అక్కడికే వెళ్లి తింటున్నారు. అలాగే పలు హోటళ్లు, రెస్టారెంట్లలో చేసే పలు రకాల బిర్యానీలు, గ్రేవీ ఐటమ్స్, ఫ్రైస్‌లలో టేస్టీ సాల్ట్, సింథటిక్ ఫుడ్ విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇందులో ప్రముఖ రెస్టారెంట్లు కూడా ఉండటం గమనార్హం.


సింథటిక్ రంగు కలిపిన గోబీ మంచూరియా


బిర్యానీలో కలిసిన సింథటిక్ రంగు


సింథటిక్ రంగు కలిసిన బెల్లం ఉంటలు

ప్రజలు ఇంటి ఆహారాన్నే తినాలి



కల్తీ ఆహారానికి ప్రజలు దూరంగా ఉండాలి. ఆర్డర్ పెట్టి తెప్పించుకునే పదార్థాలు ఎక్కువగా నిల్వ చేసినవి ఉంటున్నాయి. దానికన్నా నేరుగా హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లి ప్రత్యక్షంగా తయారు చేయించుకుని తినడం మేలు. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌తో ఊబకాయం వస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. సింథటిక్ కలర్స్, టేస్టీ సాల్ట్ కలిపిన ఆహారం తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, అల్సర్లు, క్యాన్సర్లు వస్తాయి. మిల్లెట్ ఆహారం ఎంతో మంచిది. అది కూడా పలు రకాల వెరైటీలను ఇంట్లోనే తయారు చేసుకుని తినడం మేలు. **–టి.రాజగోపాలరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, కర్నూలు**


పాలను శ్యాంపిల్ తీస్తున్న అధికారులు

కల్తీ జరుగుతోంది ఇలా..!

- పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి,నూనె కలుపుతున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టు మిక్సింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడయ్యే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకలను బట్టీల్లో మరిగించి ద్రావణాన్ని తీసి సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకల మాసం వినియోగిస్తున్నారు.
- నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నా అడిగే నాథుడు లేరు. వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో చెరువులు, నదుల్లో పెంచి పోషిస్తారు.
- మిరపకాయల్లో ఎరుపు రంగు కోసం సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- చిన్న హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి కూరలను పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యం కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్టును కలుపుతున్నారు.

క్లుప్తంగా

సి.బెళగల్ తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి



సి.బెళగల్: కర్నూలు అర్బన్ మండల తహసీల్దార్‌గా ఉన్న వెంకటలక్ష్మి బదిలీపై సి.బెళగల్ మండల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తహసీల్దార్ల బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో తహసీల్దార్ పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి జనవరిలో పదోన్నతి పొంది, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూర్ తెలుగు గంగా ప్రాజెక్ట్ (టీజీపీ) నీటి పారుదల భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. దీనితో అప్పటి నుంచి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా (డీటీగా) బాధ్యతలు నిర్వహిస్తున్న పురుషోత్తం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డెప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. ప్రస్తుతం కర్నూలు అర్బన్ మండలం నుంచి సి.బెళగల్‌కు రెగ్యులర్ తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి నియామకం కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె త్వరలో మండలంలో విధుల్లో చేరనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

పాణ్యం: కొత్తూరు గ్రామంలోని శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఉన్న నాగలింగేశ్వరస్వామి ఉపాలయ పునః నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఈట రామక్రిష్ణ, సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పాణ్యం చెంచుకాలనీలో పర్యటించి బాధితులకు చెక్కు అందించారు.

బిహార్ సర్పంచ్‌ల బృందం పర్యటన


గార్గేయపురం సచివాలయం వద్ద బిహార్ సర్పంచ్‌ల బృందం

కర్నూలు(రూరల్): బిహార్ రాష్ట్రం నుంచి వచ్చిన సర్పంచ్‌ల బృందం శుక్రవారం గార్గేయపురం గ్రామంలో పర్యటించింది. జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బీహార్ సర్పంచ్‌ల బృందం గార్గేయపురం గ్రామంలో పర్యటించి పలు కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధులను ఏ విధంగా వినియోగించుకుంటారు. పంచాయతీ పుస్తకాల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ, తదితర అంశాలను గ్రామ పంచాయతీ అధికారి పురుషోత్తం ద్వారా తెలుసుకున్నారు. ఎన్ఐఆర్‌డీ ప్రతుష్య పటాన్నాయక్, గార్గేయపురం సర్పంచ్ సోమేశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: ఉపాధి సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కోడుమూరు ఎంపీడీఓ రాముడు హెచ్చరించారు. శుక్రవారం కోడుమూరు ఉపాధి కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్ బాషా, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు,మేటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా చేరుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన పంట కుంటల నిర్మాణ లక్ష్యాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. ఏపీఓ మాట్లాడుతూ.. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలను గుర్తించి వారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఆదేశించారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సత్యనారాయణ గుప్తా శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా రైతులకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. ఇన్నాళ్లు జూన్‌లో పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి ఇప్పుడు మిన్నకుండిపోవడం దారుణమని మండిపడ్డారు. మరోవైపు పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ గూడూరు నగర పంచాయతీ కమిటీ సభ్యుల నియామకం

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ గూడూరు నగర పంచాయతీ కమిటీ సభ్యులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. ఈ మేరకు గూడూరు నగర పంచాయతీ పార్టీ కమిటీ ప్రెసిడెంట్‌గా జూపాల ఆబేలు, వైస్ ప్రెసిడెంట్లుగా హబీబ్, తెలుగు గంగాధర్, జనరల్ సెక్రటరీలుగా బోయ రాముడు, మల్లపు ఆంజనేయులు, షేక్ సద్దాం హుసేన్, పూజారి రాజశేఖర్, సెక్రటరీలుగా బోయ వీరేష్, హమాలి రామాంజనేయులు, బి.వీరేష్, పైగేరి అనుమన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కురుకుంద రాముడు, తెలుగు కొండల, కురుకుంద శివకుమార్, గొల్ల మల్లి, గొల్ల వినయ్, కురువ పెద్దయ్య, మేకల రాముడు, చంద్రశేఖర్ ఎంపికయ్యారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్గాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

గడివేముల: ఈద్ ఉల్ ఫితర్ తర్వాత ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఈద్ ఉల్ అధా (బక్రీద్)కు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ నెల 10వ తేదీ జరుపుకునే ఈ పండుగ త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. శనివారం (నేడు) ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. ఈ పండుగ జరుపుకోవడం వెనుక తండ్రీకుమారులు హజరత్ ఇబ్రహీం, ఇస్మాయిల్ త్యాగం దాగి ఉంది.

ఖుర్బానీకి ప్రాధాన్యం

ముస్లింలు నేడు బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర మక్కాను సందర్శించడానికి వెళతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణాలు చేస్తారు. కాగా శనివారం ఉదయం ఆయా ఈద్గాల్లో ప్రార్థనలు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ ఖాజీ మౌలానా షేక్ అబ్దుల్ రహిమాన్ తెలిపారు.

ముగిసిన సమ్మర్ ఓరియెంటేషన్

పాణ్యం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియెంటేషన్ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీఏ కమలాకర్ పాల్గొని విజేతలకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు వేసవిలో గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవడం ద్వారా వారి నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయన్నారు. ప్రతి విద్యార్థికి గ్రంథాలయం సాంకేతిక నిలయమన్నారు. పుస్తక పఠనంతో పాటు పోటీ ప్రపంచానికి సరిపడా సాంకేతిక విద్య కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమ్మర్‌లో నిర్వహించిన ఒరియంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి జ్ఞానాన్ని పెంచుకోగలిగారన్నారు. పాణ్యం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు రకాల క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. పాణ్యం గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మీ, ఆంగ్ల ఉపాధ్యాయుడు నాగేశ్వరావు, టీడీసీ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.


విజేతలతో పశుసంవర్ధకశాఖ ఏడీఏ కమలాకర్

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

పాణ్యం: విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ సాధ్యమని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీప్రియా అన్నారు. శుక్రవారం బలపనూరు, కౌలూరు, నెరవాడ గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు సాగుకు ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. దీని వల్ల తెగుళ్లను కొంత వరకు నివారించుకోవచ్చని తెలిపారు. విత్తనశుద్ధి చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల సాగు, చీడ పీడలపై ఐసీఏఆర్ శాస్త్రవేత్త సుగన్న తెలియజేశారు. పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, సమీకృత దాణా, పశువులకు వచ్చే వ్యాధులు, తదితర వాటిపై పశువైద్యాధికారి పుల్లయ్య వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీప్రియా

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం


శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల గేటు వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాణ్యం: డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పాణ్యం మండల పరిధిలోని ఆర్‌జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్‌జీఎం కళాశాలలో 203 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 181 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. అలాగే శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో 203 మంది అభ్యర్థులకు గాను 172 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 సుబ్రమణ్యం తెలిపారు. అలాగే మధ్యాహ్నం ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో 200 మందికి గాను 176 మంది, శాంతిరామ్‌లో 200 మందికి గా ను 175 మంది హాజరైనట్లు వెల్లడించారు. ఆయా పరీక్ష కేంద్రాలను నంద్యాల ఎస్‌డీపీఓ జావళి అల్ఫోన్స్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలి

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.యూనస్ బాషా



కర్నూలు (రూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ముస్లింలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (మైనార్టీ సెల్) ఎస్.కె.యూనస్ బాషా డిమాండ్ చేశారు. నంద్యాల చెక్‌పోస్టులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇస్తానని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ముస్లిం మైనార్టీలతో కర్నూలులో బహిరంగ సభ ఏర్పాటు చేసి ఇస్లామిక్ బ్యాంక్‌ను కచ్చితంగా తీసుకొస్తామని, అర్హత కలిగిన పేద ముస్లింలందరికీ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఎదుగుదలకు సహకరిస్తానని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటు చేసే విషయంలో ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఇస్లామిక్ బ్యాంకులను ఏర్పాటు చేసి పేద ముస్లింలకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పుస్తకాల పేరిట దోపిడీని అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పుస్తకాల మాఫియాను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీచైతన్య, నారాయణ, శ్రీలక్ష్మీ, మాంటిస్సోరి, భాష్యం విద్యాసంస్థల ఎదుట నిరసనలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం కాక మునుపే పుస్తకాల పేరుతో ఎల్‌కేజీ విద్యార్థికి రూ.5 వేలు వసూలు చేస్తున్నారని, పదో తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.10 వేల వరకు, ఇంటర్ పుస్తకాల పేరుతో రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్యన్, అంజి, మల్లేష్, పృథ్వీ, యోగి, హర్ష పాల్గొన్నారు.


రోడ్డుపక్కన దుకాణాల ముందు తవ్విన మురుగునీటి కాల్వ


కాలనీలోకి వెళ్లకుండా అడ్డుగా కాల్వను తవ్వి వదిలేసిన దృశ్యం

తవ్వారు.. వదిలేశారు!

కోడుమూరు రూరల్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు ఇంద్రజిత్ కాలనీ వద్ద పంచాయతీ అధికారులు మురుగునీరు వెళ్లేందుకు వారం రోజుల క్రితం కాల్వను తవ్వకం మొదలుపెట్టి మధ్యలోనే ఆపేశారు. దీంతో మురుగు నీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో పాటు తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. కాల్వ నిర్మాణం చేపట్టకుండా మధ్యలోనే వదిలేయడంతో ఇటు లక్ష్మీనగర్ కాలనీలోకి వెళ్లేందుకు దారిలేకపోవడంతో పాటు, దుకాణాల ముందు ఎటూ కాకుండా అడ్డదిడ్డంగా తవ్వేసి వదిలేయడంతో దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాల్వ నిర్మాణం చేపట్టలేనప్పుడు ఎందుకు తవ్వి వదిలేశారంటూ దుకాణదారులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లేందుకు కాల్వనైనా నిర్మించాలి, లేదంటే తవ్విన గుంతను పూడ్చివేయాలని ఆయా కాలనీవాసులు, దుకాణదారులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం


నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని గూడూరు నగర పంచాయతీ కార్మికులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో భాగంగా గూడూరు నగర పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం నాటికి 31 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మికులు అరవింద్, మధు మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించాలని నెలరోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంటు చేయడంతో పాటు, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా ప్రతినెలా జీతాలను సక్రమంగా ఇచ్చి తమకు ప్రభుత్వ పథకాలను వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే పట్టణంలో నీటి సరఫరా నిలిపివేయడంతో పాటు, వీధి దీపాలను వెలిగించకుండా నిరవధిక సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. నగర పంచాయతీ కార్మికులు అల్లిబాషా, దూకేశ్వరరావు, షబ్బీర్‌బాషా, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, ప్రభాకర్, ఉసేన్ పాల్గొన్నారు.